నేటి రోజుల్లో రోగాన్ని బట్టి డాక్టర్,
అవసరాన్ని బట్టి మనుషులు
మారడంలో వింతేముంది..
మరి మన చాదస్తం
కాకపోతే..

netisudiksha.online

# నేటి సుదీక్ష
సమాజానికి సరైన దృక్పథం
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న నేటి సుదీక్ష దినపత్రికలో,బ్యూరో, మండలాల రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 7288033333

హనుమకొండ సంపుటి 01 సంచిక 76 శనివారం ,ఆగస్టు 08, 2026 , పేజీలు - 4 వెల : 2.00 PRGI NO : TGTEL/26/A3170

# చేనేతకు 50 ఏళ్లకే పింఛన్



**అమరావతి, ఆగస్టు 07**చేనేతలను ఆదుకునేందుకే నేతన్నల నేస్తం పథకాన్ని తెచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 వేలు సాయం అందిస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా కొత్తపేటలో 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వకున్నా 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. సబ్సిడీపై చేనేత కార్మికులకు విద్యుత్ ఇస్తామన్న సీఎం, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చీరాల కర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు ఎగుమతి : దేశం గర్వించే కళ చేనేత కళ అని, మన రాష్ట్రం ఇలాంటి కళలకు నిలయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొత్తపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. మన నేత కార్మికులు అగ్గిపెట్టెలో పట్టే చీర తయారు చేశారని గుర్తు చేశారు. "చీరాల కర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు ఎగుమతి చేసేవారు. చీరాలను ఒకప్పుడు మినీ ముంబ యి అనేవారు. అనేక చేనేత ఉత్పత్తులకు గుర్తింపు తీసుకొచ్చారు. 1.27లక్షల మంది ఈ రంగంపైనే ఆధారపడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు టీడీపీకే ఓటు వేశారు. సబ్సిడీపై చేనేతలకు విద్యుత్ ఇస్తామన్నాం, మాట నిలబెట్టుకున్నాం.చేనేతలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తున్నాం. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నాం. చేనేతలకు రూ. 25 వేలు ఇస్తున్నాం. అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చాం. ఎన్డీయే ప్రభుత్వం బీసీలకు రుణపడి ఉంది. తప్పకుండా మీ రుణం తీర్చుకుంటాం. సంజీవని పేరుతో రూ. 2.50 లక్షల ఆరోగ్య బీమా ఇస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది లేని పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చాం. రెండేళ్లలో మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

## FCRA బిల్లుపై అమెరికాకు ఎందుకు?

- అంతర్గత వ్యవహారమని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ
- షేక్ హసీనా ఈవెంట్‌తోనూ భారత్‌కు సంబంధం లేదని క్లారిటీ



**న్యూ ఢిల్లీ :**విదేశీ నిధుల నియంత్రణ చట్టం ( FCRA) సవరణ బిల్లుపై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు చేసిన వ్యాఖ్యల్ని భారత్ తోసిపుచ్చింది. ఇంకా పలు జాతీయ, అంతర్జాతీయ అంశాలపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ( FCRA) శుక్రవారం తన వైఖరిని వెల్లడించింది. ఇందులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా దిల్లీలో నిర్వహించిన ఈవెంట్, భారత ప్రధాని నరేంద్ర మోదీ– ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య టెలిఫోన్ సంభాషణ, శ్రీలంక మత్స్యకారుల సమస్య, సౌదీ– పాకిస్థాన్– తుర్కియే రక్షణ ఒప్పందం వంటి కీలక అంశాలున్నాయి.

# ఇంటి ముంగిటకే పౌర సేవలు




**హైదరాబాద్, ఆగస్టు 7:** నగరంలోని బేగంపేటలో , ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ ట్రాన్స్ఫర్మేషన్ కాంక్లేవ్' కార్యక్రమాన్ని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘనంగా ప్రారంభించారు. పాలనలో ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంపై నిర్వహించిన ఈ సదస్సులో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్, మిత్రా సీఈవో ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్యకుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డా.దేవేష్ త్యాగి, అలాగే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీ వంటి ప్రముఖ అధికారులు పాల్గొని తమ ఆమోదయోగ్యమైన సలహాలు, అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌తో పాటు మోసాలకు తావులేని బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. టీ–ఫైబర్ ద్వారా దాదాపు 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు డిజిటల్ కనెక్టివిటీ అందించడమే లక్ష్యం. అలాగే, వృద్ధులు, దివ్యాంగులకు పౌర సేవలను నేరుగా ఇంటి ముంగిటకే త్వరలో అందిస్తాం. 'డిజిటల్ ఆఫీస్' ప్రాజెక్ట్ ద్వారా పేపర్ లెస్ గవర్నెన్స్‌ను వేగవంతం చేస్తాం. 20కి పైగా ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డును సైతం రూపొందిస్తున్నాం' అని అన్నారు.


## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**హైదరాబాద్, ఆగస్టు 7:** చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణ పేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగా ణ అగ్రస్థానంలో ఉందన్నా రు. ద్వారా యువత కు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ. 18 వేల ఆర్థిక సాయం అందజేసు _న్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ. 5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ. 49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ. 980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలి

- ఈ నెల 10న వరుణయాగం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం
- ముహూర్తం ఖరారు చేసిన యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు
- దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువులు



**హైదరాబాద్ :**తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణం వేదికగా ఈ యాగం చేయనున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఖరారు చేసిన ముహూర్తం ప్రకారం యాగ క్రతువులు నిర్వహించనున్నారు. పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి : 10న సాయంత్రం జరిగే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని యాదాద్రి ధర్మకర్తల మండలి ఛైర్మన్ మన్నె సత్య నారాయణ రెడ్డి (ఎంఎస్?ఎన్? రెడ్డి) తెలిపారు. కృష్ణ, గోదావరి నదులు, రిజర్వాయర్లు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడి పంటలు బాగా పండాలనే సంకల్పంతో సీఎం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. దాదాపు 22 లక్షల ఎకరాల ఆయకట్టు : ఆగస్టు 10న సాయంత్రం 3:20 నుంచి 3:24 నిమిషాల మధ్య పూర్ణాహుతి కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు. 108 మంది రుత్వికులు, 11 హోమగుండాలు, వేద పండితులు, అర్చక బృందం ఈ యాగంలో పాల్గొంటారని దేవాదాయ శాఖ తెలిపింది. రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ఎల్ నినో ప్రభావం తొలగిపోయి ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర ప్రాజెక్టుల్లో నీరు చేరినప్పటికీ శ్రీశైలం నుంచి నీటి విడుదల కాకపోవడంతో నాగార్జునసాగర్ ప్రస్తుతం డెడ్ స్టోరేజ్‌లోనే ఉంది. శ్రీశైలం నిండటానికి మరో వారం రోజులు పట్టే అవ కాశం కనిపిస్తుంది.

# మిషన్ భగీరథ'కు పదేళ్లు



**హైదరాబాద్,**తెలంగాణలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన, సుం్క్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ప్రతిష్ఠాత్మక 'మిషన్ భగీరథ' పథకం నేటితో విజయవంతంగా పదేళ్లు ) పూర్తి చేసుకుంది. ఈ చారిత్రాత్మక మైలురా యిని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్న ఆయన.. మిషన్ భగీరథ అనేది కేవలం ఒక సాధారణ ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఒక మహత్తరమైన తాగునీటి విప్లవమని కొనియాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి, మానసపుత్రిక నుంచి పుట్టుకొచ్చిన ఈ ప్రాజెక్టు దేశానికే ఆదర్శంగా నిలిచిందని హరీశ్ రావు గుర్తుచేశారు:కష్టాలకు చరమగీతం: ఒకప్పుడు బిందెడు నీళ్ల కోసం కిలోమీటర్ల దూరం నడిచే మహిళల కష్టాలను, వేసవి నీటి ఎద్దడిని తీర్చడానికి కేసీఆర్ ఈ బృహత్ యజ్ఞానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

# కేసీఆర్ హయాం పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్!





**హైదరాబాద్, ఆగస్టు 7:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఒక ఘాటైన బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వేడుకలు జరుపుకోవడానికే పరిమితం కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడే నేతన్నల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. కేసీఆర్ హయాం సంక్షేమానికి ప్రభుత్వం పక్కన పెట్టిందని కేటీఆర్ లేఖలో ఆరోపించారు. .నేతన్న బీమా ɑ చేయూత బంద్: 55,000 మందికి పైగా కార్మికులకు ప్రీమియం చెల్లిస్తూ అందించిన 'నేతన్న బీమా' (రూ. 5 లక్షల ఇన్సూరెన్స్), అలాగే పొదుపునకు ఊతమిచ్చే 'నేతన్నకు చేయూత' పథకాల చెల్లింపులను నిలిపివేశారని మండిపడ్డారు.

# వచ్చే ఎన్నికల్లో గెలుపు మాదే



**ఢిల్లీ:** తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు.

నేటి సుదీక్ష
సమాజానికి సరైన దృక్పథం
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం, ఆగస్టు 08, 2026


# వరంగల్ ఎంజీఎంలో ఖాళీల భర్తీకి కేంద్రం చొరవ చూపాలి: ఎంపీ కడియం కావ్య

**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (సుదీక్ష న్యూస్):** వరంగల్ ప్రభుత్వ వైద్య కళాశాల, మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రితో పాటు కేంద్ర సహకారంతో నడిచే ప్రభుత్వ వైద్య సంస్థల్లో వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్ అధికారులు, పారామెడికల్ సిబ్బంది కొరతపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఆయా సంస్థల్లో మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను వెల్లడించాలని, గత మూడు సంవత్సరాల్లో శాశ్వత, కాంట్రాక్టు నియామకాల ద్వారా చేపట్టిన భర్తీ ప్రక్రియతో పాటు తీసుకున్న చర్యల వివరాలను తెలియజేయాలని కేంద్రాన్ని కోరారు.ఈ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆరోగ్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రాష్ట్ర ప్రభుత్వాలు పంపే ప్రతిపాదనల మేరకు సాంకేతిక, ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది మంజూరైన పోస్టులు,



ఖాళీల వివరాలు హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా (ఎచ×) నివేదికలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వైద్యుల కొరతను తగ్గించేందుకు ప్రత్యేక అలవెన్సులు, ప్రోత్సాహకాలు, కాంట్రాక్టు నియామకాలు, "యూ కోట్--వీ పే" వంటి విధానాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, ఆరోగ్యం రాష్ట్ర అంశమని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సమంజసం కాదన్నారు. ఉత్తర తెలంగాణ ప్రజలకు ప్రధాన వైద్య సేవలు అందిస్తున్న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి కారణంగా రోగులు నాణ్యమైన వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఎంజీఎం వంటి కీలక ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఖాళీల భర్తీకి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, తెలంగాణకు అవసరమైన అదనపు సహకారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఆరోగ్య రంగంలో బాధ్యతలను రాష్ట్రాలపైకి నెట్టివేయకుండా కేంద్రం తన వంతు బాధ్యతను నిర్వర్తించి, వైద్య సిబ్బంది ఖాళీలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు.

# కాశిబుగ్గలో భారీ శివుని విగ్రహ నిర్మాణానికి కొండా దంపతుల సంకల్పం



**వరంగల్, ఆగస్టు 7 (సుదీక్ష న్యూస్):** కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర ఆలయం పక్కనున్న స్థలంలో భారీ శివుని విగ్రహాన్ని నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సంకల్పించారు.కొండా దంపతుల ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్ సూచనలతో, ఈ నిర్మాణానికి సంబంధించిన మంత్రి ఎండార్స్ చేసిన వినతిపత్రాన్ని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీతకు అందజేశారు.ఈ సందర్భంగా కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వర ఆలయం మాజీ ధర్మకర్త లక్కిరెడ్డి పూర్ణేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. త్వరలోనే శివుని విగ్రహ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో దాసరి రాజేష్, కుడికాల కోటేశ్వర్, నీలం శ్రీనివాస్, మేడకుర్తి లోకేష్, పల్లకొండ రాజమణి పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి: కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మహాదీక్షలు

**వరంగల్, ఆగస్టు 7 (సుదీక్ష న్యూస్):** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని పేరా-3ను పార్లమెంట్‌లో సవరించి రద్దు చేయాలని దళిత క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతియుత మహాదీక్షల్లో డిమాండ్ చేశారు.వరంగల్ పోచమ్మ మైదానంలో దళిత క్రైస్తవ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల కుమార్ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న మహాదీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోపాల్ నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మీసాల ప్రకాశ్ మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేలా ఎస్సీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని పేరా-3ను సవరించి రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కులను పరిరక్షించాలని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని అన్నారు.2007లో రంగనాథ్ మిశ్రా కమిషన్ చేసిన సిఫారసులు, 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని గుర్తు చేశారు. అలాగే 2022లో ఏర్పాటు చేసిన కేజీ బాలకృష్ణ కమిషన్ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెల్లడించి, అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 10న హనుమకొండ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే దళిత క్రైస్తవ శాంతియుత నిరసన ర్యాలీని



విజయవంతం చేయాలని, బహుజన వర్గాలన్నీ పాల్గొని సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు.ఐదు రోజుల మహాదీక్షల ముగింపు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్ దీక్షా శిబిరంలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.దళిత క్రైస్తవ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల కుమార్ మాదిగ మాట్లాడుతూ, ఐదు రోజులపాటు మహాదీక్షలను విజయవంతం చేసిన రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు, సంఘీభావం తెలిపిన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమానికి బీఎం పార్టీ నాయకుడు మట్టి ప్రసాద్, చేగువేరు ఫౌండేషన్ చందు అగస్టిన్, ప్రొఫెసర్ కొండల్‌రావు, ముస్లిం నాయకుడు సర్దార్, మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమార్, పెరుమాండ్ల లక్ష్మణ్, సారంగపాణి, జన్ను శ్యామ్, పాస్టర్ జన్ను ప్రభాకర్, ఎం.కే. బాబు, జన్ను యోసెఫ్ రాజ్, జన్ను ప్రశాంత్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో భవాని పాఠశాలలో బోనాల వేడుకలు

**- సాంప్రదాయ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల సందడి**



**సుదీక్ష న్యూస్ । మల్లంపల్లి । ఆగస్టు 7:** మల్లంపల్లి మండలంలోని భవాని పాఠశాలలో బోనాల పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ పండుగ వాతావరణాన్ని తలపిస్తూ విద్యార్థుల సందడితో కళకళలాడింది.పాఠశాలవిద్యార్థులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు స్వయంగా బోనాలను సిద్ధం చేసి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. బోనాల పండుగ విశిష్టతను ప్రతిబింబించేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈరోజు మీ ప్రతిభకు మంచి ప్రారంభం. కష్టపడి చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించి జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలి. భవిష్యత్తులో మరింతగా రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు వాటి పరిరక్షణపై అవగాహన కల్పించారు.

# జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఓబీసీ మోర్చా

**వరంగల్, ఆగస్టు 7 (సుదీక్ష న్యూస్):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో కొత్తవాడ జంక్షన్‌లోని గోపాలస్వామి ఆలయం సమీపంలో ఉన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గంట రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వానికి చేనేత రంగం ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. మన చేనేత కళాకారుల నైపుణ్యంతో తయారయ్యే వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని, వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో చేనేత ఒకటని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో చేనేత రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ముద్ర రుణాలు, బున్కర్ సంక్షేమ పథకాలు, డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్ అవకాశాల వంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. సంప్రదాయ చేనేతను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి నేతన్నలకు కొత్త మార్కెట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు



కందగట్ల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ మాట్లాడుతూ, భారతదేశంలో పుట్టిన చేనేత కళను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రధానమంత్రి ఇచ్చిన "వోకల్ ఫర్ లోకల్" పిలుపు మేరకు వారంలో కనీసం ఒక రోజు స్వదేశీ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి చేనేత కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు.

**అనంతరం చేనేత కళాకారులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.**

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు కందగట్ల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, సముద్రాల పరమేశ్వర్, 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆడేపు సప్న, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మాదాసి రాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక, జిల్లా ప్రధాన కార్యదర్శి భాకం హరిశంకర్, జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్, మిట్టపల్లి కపిల్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కోమాకుల నాగరాజు, మాచర్ల దీన్ దయాల్, కొంతం సంగీత్, కందగట్ల మల్లికార్జున్, ఓబీసీ మోర్చా జిల్లా పదాధికారులు ఆడేపు విక్రమ్, పేరాల భాస్కర్, బండి సుజాత, కట్ల రాధిక, మార్త ఉషారాణి, వల్లే రమేష్ యాదవ్, కొంపల్లి రాజు, మెంతుల యాదగిరి, కొత్తకొండ అరుణ్, నాయకులు బొడ్డు రాకేష్, అల్లి అజయ్, బి. శివశంకర్, బి. నగేష్, ప్రభాకర్ గుప్తా, ముత్తినేని లక్ష్మణ్, పిన్నోజు శ్రీనివాస్, అమర్ పాల్గొన్నారు.

# తప్పిన ముంపు ముప్పు..!

**మంచిర్యాల, ఆగస్టు 7 ():** బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం విషయం పక్కన బెడితే... అది కుంగడం వ ల్ల మంచిర్యాల జిల్లా ప్రజలకు మాత్రం మేలు జరిగినట్లయింది. ప్రాజెక్టుల సముదాయం నిర్మించిన నాటి నుంచి వ ర్షాకాలంలో ప్రతియేటా మంచిర్యాల నగరాన్ని వరదలు చు ట్టుముట్టడం ఆనవాయితీగా మారింది. దీంతో వర్షాకా లం



వస్తుందంటే గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు బిక్కు బిక్కుమంటూ గడిపేవారు. అందుకు భిన్నంగా గత నెల 30వ తేదీ నుంచి మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షా లకు వరదలు నగర దరిదాపులకు కూడా రాకపోవడం తో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కిందటి ఏడాది కాళేశ్వరం సముదాయంలోని మేడిగడ్డ బ్యారేజీ పగుళ్ల కారణంగా కుం గిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి అందులో నీరు నిలువ చేయడం లేదు. ప్రాజెక్టు గేట్లన్నీ ఎత్తి ఉంచడంతో గోదావరి ప్రవాహానికి అడ్డు తొలగిపోయింది. వరద నీరం తా నేరుగా ప్రవహించడంతో ఎక్కడ కూడా ప్రజలకు ఇ బ్బందులు తలెత్తలేదు. మరోవైపు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని సైతం పెద్ద మొత్తంలో గోదావరిలోకి విడుదల చేశారు. అ యినా ఎలాంటి నష్టం వాటిల్ల లేదు. దీంతో కాళేశ్వరం ప్రా జెక్టు కుంగిపోయి ప్రజలకు మేలు చేకూర్చిందనే అభి ప్రా యాలు వ్యక్తమవుతున్నాయి.

2022 నుంచి వరుసగా మూడు సంవత్సరాలపాటు మం చిర్యాల నగరం వరద ముంపునకు గురైంది. 2022 జూలై 13న కురిసిన భారీ వర్షాలకు నగరం పూర్తిగా జలదిగ్బం ధమైంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు తెరవడంతో గోదావరి ఉప్పొంగి జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు బ్యాక్ వాటర్ ఇళ్ల లోకి చేరింది. దీంతో పాత మంచిర్యాల, రెడ్డి కాలనీ, ఎల్ ఐసీ కాలనీ, రాంనగర్, ఎన్టీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, ఆది త్య ఎన్‌క్లేవ్, వేంపల్లిలో రెండో అంతస్తు సగం వరకు ఇళ్లు నీట మునిగాయి. 48 గంటలుగా కాలనీలన్నీ నీటిలో ముని గి ఉన్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలో బహుళ అంతస్థుల భవనాలు పూర్తిగా నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాలర్లు పెద్ద మొత్తం లో థర్మకోల్ తెప్పలు, నాటు పడవల ద్వారా ప్రజలను సు రక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో గల మాతా శిశు సంరక్షణ కేంద్రం పూ ర్తిగా నీటిలో మునిగిపోయింది. అర్ధరాత్రి రోగులను మరో చోటుకి తరలించాల్సి వచ్చింది. సుమారు రూ. 3 కోట్ల వి లువైన అదునాతన పరికరాలు పూర్తిగా బురదలో కూరుకుపోయాయి.

# చేనేత కళాకారులను ఆదుకోవాలి: అమీన్పూర్‌లో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

**అమీన్ పూర్, ఆగస్టు 07:** అమీన్ పూర్ పట్టణ మరియు మండల పద్మశాలి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమీన్ పూర్ లోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజి, శ్రీ భావనాఋషి పద్మశాలి భవనంలో సంఘం గౌరవ అధ్యక్షులు మాకం మల్లేష్ నేతృత్వంలో ఈ వేడుకలు కొనసాగాయి. ఈ సందర్భంగా మాకం మల్లేష్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో కూడా చేనేత పరిశ్రమను కాపాడడం, ప్రోత్సహించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. మనం చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా నేతన్నల జీవితాలకు అండగా నిలబడటమే కాకుండా, మన దేశ సంప్రదాయాన్ని కూడా సంరక్షించిన వారమవుతామన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కళాకారులను మరింతగా గుర్తించి, వారికి అందవలసిన సంక్షేమ పథకాలు మరియు నిధులు సకాలంలో చేరేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కుంట్ల ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఆనందపు మహేందర్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం యాదగిరితో పాటు గోనె లింగం, మసుర ఆగమయ్య, భామిని జోగినాథ్, ఉడుత ఆనంద్, పంచల జనార్ధన్, బత్తుల కనకారావు, గోప శ్రీ విష్ణు, పొన్న ప్రభాకర్, నల్ల లింగయ్య, రామనాథం, నాగభూషణం, పట్నం కృష్ణ, సంగు ప్రభాకర్ తదితర పద్మశాలి కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

నేటి సుదీక్ష
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

# ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలి

**- నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన**




**శామీర్ పేట్ :** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని టిఎస్ యుటిఎఫ్ శామీర్ పేట్ మండల అధ్యక్షుడు పి తిరుమలేష్ అన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పిసి) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై భోజన సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరణ, పిఆర్సి ,6 డిఏ లు, పెండింగ్ బకాయిలు సాధన కై నిరసన తెలపడం జరిగిందన్నారు. నాలుగు దశల పోరాటాలల్లో భాగంగా శుక్రవారం రోజున నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూముకుంట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లాల్ గాడి మలకపేట, మండలంలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులు నిరసన తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుమార్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చింతల్ సంజీవయ్య నగర్‌లో శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి 9వ వార్షికోత్సవ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7:** చింతల్ సంజీవయ్య నగర్‌లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయం 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని ప్రజలందరూ ఆనందంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయ కమిటీ సభ్యుడు విజయ్ గుప్తా, గడ్డం రాజేందర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు స్వాతి రాజేందర్ రెడ్డి, యాదగిరి, పెంటయ్య ముదిరాజ్, సూరా రవీందర్ గౌడ్, విజయేందర్ గుప్తా, ఉమామహేశ్వర్, కృష్ణమ నాయుడు, ఉమేష్, జానయ్య, కృష్ణ కుమార్, సిహెచ్ శ్రీనివాస్ గుప్తా, కిరణ్ యాదవ్, నాంపల్లి విజయ్, రాజు గుప్తా, రాజమౌళి, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి కేంద్రం వేల కోట్ల నిధులు: రావు పద్మారెడ్డి

**హనుమకొండ, ఆగస్టు 7 (సుదీక్ష న్యూస్)** : గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినప్పటికీ, ఆ పనులకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్రెడిట్ తీసుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ బీజేపీ అభ్యర్థి శ్రీమతి రావు పద్మారెడ్డి ఆరోపించారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ, రైల్వే, రవాణా, పట్టణాభివృద్ధి, తాగునీటి వంటి పలు పథకాల ద్వారా వరంగల్ నగరానికి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందన్నారు.స్మార్ట్ సిటీ పథకం కింద రూ.500 కోట్లతో నయీమ్ నగర్ నాలా అభివృద్ధి, 100 ఫీట్ రోడ్ డక్ట్, ప్రధాన రహదారులు, పబ్లిక్ గార్డెన్, లైబ్రరీల పునర్నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధి, వడ్డేపల్లి చెరువు కట్ట అభివృద్ధి వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు.అలాగే కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి రూ.521.36 కోట్లు, కాజీపేట రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.24.45 కోట్లు, విజయవాడ--బల్లార్షా మూడో రైల్వే లైన్‌కు సుమారు రూ.4,850 కోట్లకు పైగా, కాజీపేట బైపాస్ రైల్వే లైన్‌కు రూ.125 కోట్లు, మామునూర్ ఎయిర్‌పోర్ట్ తొలి దశ పనులకు రూ.500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.నగర ప్రజా రవాణా కోసం పీఎం ఈ-బస్ పథకం



కింద ఇప్పటికే 100 ఎలక్ట్రిక్ బస్సులు, తాజాగా మరో 100 బస్సులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అదేవిధంగా పీఎం స్వనిధి పథకం ద్వారా 62,937 మంది వీధి వ్యాపారులకు రూ.117.56 కోట్ల రుణాలు, హృదయ్ పథకం కింద రూ.33 కోట్లు, అమృత్ పథకం ద్వారా తాగునీటి సరఫరాకు రూ.274.25 కోట్లు, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా రూ.1,550 కోట్లకు పైగా నిధులు అందాయని వెల్లడించారు.నగరంలో ప్రస్తుతం జరుగుతున్న రోడ్లు, డ్రైనేజీలు, స్మశానవా టికల నిర్మాణం వంటి పనులు 14వ, 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులతోనే జరుగుతున్నాయని, ఇటీవల ఎమ్మెల్యే ప్రారంభించిన రూ.50 లక్షల సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు కూడా 15వ ఆర్థిక సంఘం నిధులతోనే చేపట్టినవేనని ఆమె పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని విమర్శించిన రావు పద్మారెడ్డి, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే భారతీయ జనతా పార్టీ ప్రజల తరపున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆమె హెచ్చరించారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**-- చేనేత వస్త్రాల కొనుగోలుతో నేతన్నలకు భరోసా**

**-- వరంగల్‌ను చేనేత హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి**

**సుదీక్ష న్యూస్, హనుమకొండ । ఆగస్టు 7:** చేనేత కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత అనేది కేవలం వృత్తి మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక నైపుణ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతం దేశవ్యాప్తంగా చేనేత కళకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని గుర్తు చేశారు.చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న డిజైన్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ముడి సరుకు, రుణ సౌకర్యాలు, బీమా, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను




కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.హనుమకొండ జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగ అభివృద్ధికి సమగ్ర డీపీఆర్ రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని చేనేత సంఘాల ప్రతినిధులకు సూచించారు.జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే సూచనల మేరకు చేనేత సంక్షేమానికి సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేసి అందించాలని అధికారులను, సంఘాల ప్రతినిధులను కోరారు.అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించడంతో పాటు చేనేతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయ స్టాల్‌ను ఎమ్మెల్యే సందర్శించి చేనేత చీరను కొనుగోలు చేసి నేతన్నలకు తన మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, చేనేత సంఘాల ప్రతినిధులు, అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# ప్రతి శిశువుకు తల్లిపాలే అమృతాహారం : మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి

**అలియాబాద్ మున్సిపాలిటీలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**



**శామీర్ పేట్ :** ప్రతి శిశువుకు తల్లిపాలే అమృతాహారమని తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, మాతృ ఆరోగ్యంపై నిపుణులు అవగాహన కల్పించి సమాజంలో తల్లిపాలపై మరింత చైతన్య పరచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మెడిసిటీ కాలేజ్ ఆఫ్





నర్సింగ్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు--2026 సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలను పట్టించాలన్నారు. మొదటి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలే ఇవ్వడం ప్రతి తల్లి బాధ్యతన్నారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని, శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. అదేవిధంగా తల్లిపాల వల్ల తల్లుల ఆరోగ్యం కూడా మెరుగుపడి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించడం, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించడమేనని ఆమె అన్నారు. కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, సమాజంలోని ప్రతి ఒక్కరూ తల్లిపాలను ప్రోత్సహించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అకాడెమిక్స్ డైరెక్టర్ డా. సి. మల్లికార్జున్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్. హైమావతి, వైస్ ప్రిన్సిపాల్ బ్యూలా జానెట్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ అజిత్ కిరణ్, ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ నర్సింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమారి పి.వి. ఝాన్సీ రాణి, లెక్చరర్ కుమారి డి. కీర్తి ప్రియ, చైల్డ్ హెల్త్ నర్సింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ జి. జ్యోష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ మెడికల్ సర్జికల్ నర్సింగ్ జోసెఫ్ జాన్ క్రాస్టో, మెడిసిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ అధ్యాపక బృందం, గర్భిణీలు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపల్ , ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 'కొరియన్ కనకరాజు'కు
# అదిరిపోయే ఆరంభం




వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడుదలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళతోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివేశాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నాయని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల నుంచి గట్టి పోటీ లేకపోవడం కూడా 'కొరియన్ కనకరాజు'కు కలిసొచ్చే అంశంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సానుకూల పరిస్థితుల్లో తొలి వారాంతంలో సినిమా భారీ వసూళ్లను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా మంచి బజ్, పాజిటివ్ టాక్‌తో మొదలైన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు చాలా కాలంగా ఎదురుచూస్తున్న విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి.

# ఓటీటీ లోకి జన నాయగన్





తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు'). రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టడానికి ముందు విజయ్ నటించిన సినిమా కావడంతో, మొదటి నుంచి ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ వివాదాలు, తదితర కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని అడ్డంకులను దాటుకుని జూలై 23న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలైంది. మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకున్నప్పటికీ, విజయ్ క్రేజ్ కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగిన కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పుడీ సినిమా ఓటీటీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. 'జన నాయగన్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జీ5' ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. లేటెస్ట్ రిపోర్ట్స్ మేరకు, ఈ సినిమా ఆగస్టు 21వ తేదీ నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఒరిజినల్ తమిళ వెర్షన్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలోనే దీనిపై ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రానుంది. మాస్ చిత్రాల దర్శకుడు హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ యాక్షన్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ దాదాపు రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు ఒక ముఖ్యమైన పాత్రలో ఆకట్టుకుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పవర్‌ఫుల్ విలన్‌గా మెప్పించారు. వీరితో పాటు ప్రకాష్ రాజ్, ప్రియమణి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, నాజర్, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించారు.

## భావోద్వేగభరితంగా 'విశ్వనాథ్ & సన్స్' ట్రైలర్ !



తమిళ కథానాయకుడు సూర్య నటిస్తున్న స్ట్రయిట్ తెలుగు చిత్రం 'విశ్వనాథ్ & సన్స్' వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం (నేడు) విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను గమనిస్తే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో రూపొందుతోన్న కుటుంబ కథా చిత్రంగా 'విశ్వనాథ్ & సన్స్' ప్రేక్షకుల ముందుకు రాబోతుందనే విషయాన్ని ట్రైలర్ ద్వారా మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. 'నా బాబు ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాలి' అంటూ రాధికా శరత్ కుమార్ డైలాగ్ నుంచి, గెలిచే వరకు ఆగకూడదు.. గెలిచిన తరువాత ఆ గెలుపు గురించి ఎక్కువ మాట్లాడకూడదు అంటూ సూర్య చెప్పే డైలాగ్ వరకు ట్రైలర్ ఆద్యంతం ఎంతో భావోద్వేగభరితంగా అనిపిస్తుంది. 'నీ సీటు చాలా స్ట్రాంగ్', 'ఇప్పుడు ఎందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ కథనాయిక మమితా బైజు సూర్యను టీజ్ చేస్తూ చెప్పే సంభాషణలు ఫన్నీగా అనిపించాయి. ట్రైలర్‌లో ఎమోషన్స్, సెన్సిటివ్ ఎంటర్‌టైన్‌మెంట్, సెంటిమెంట్ ఇలా అన్నీ మిక్స్ చేసి దర్శకుడు సినిమా కథాంశాన్ని ఆడియన్స్‌కు ట్రైలర్ ద్వారా హింట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. నలభై ఏళ్ల వయసులో అంతర్జాతీయ పిస్టల్ షూటర్‌గా సూర్య ఎలా ఎదిగాడు? అనే అంశాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ట్రైలర్‌తో ఆసక్తి కలిగించి సినిమా గురించి వెయిట్ చేసే విధంగా దర్శకుడు వెంకీ అట్లూరి చేసిన ట్రైలర్ కట్ బాగుంది. జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఆహ్లాదంగా అనిపించింది.



## ట్రెడిషనల్ లుక్ లో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్.. రితికా నాయక్ లేటెస్ట్ పిక్స్!

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఢిల్లీ భామ రితికా నాయక్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తన నటనతోనే కాకుండా, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారు హృదయాలను దోచుకుంటోంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా షేర్ చేసిన ట్రెడిషనల్ ఫొటోషూట్ పిక్స్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ అభిమానులను అలరిస్తున్న రితికా నాయక్ లేటెస్ట్ విశేషాలు మీకోసం. టాలీవుడ్‌లో లక్కీ హీరోయిన్‌గా ముద్ర: ఢిల్లీ నుంచి వచ్చిన రితికా నాయక్ చాలా తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పటివరకు చేసిన సినిమాలన్నీ మంచి విజయాన్ని సాధించడంతో ఆమెను టాలీవుడ్‌లో లక్కీ హీరోయిన్‌గా అభివర్ణిస్తున్నారు. ఇక కెరీర్ ప్రారంభంలోనే వరుస విజయాలు అందుకోవడం వల్ల ఆమెకు అవకాశాలు వెల్లువలా వస్తున్నాయి. తన క్యూట్‌నెస్‌తో ప్రతి సినిమాలోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.యంగ్ హీరో విశ్వక్ సేన్ నటించిన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' సినిమాతో రితికా తెలుగు తెరపై మెరిశారు. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా, తన నటనతో మంచి మార్కులు కొట్టేశారు. ఆ తర్వాత నేచురల్ స్టార్ నాని నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో ఆయన కూతురిగా చిన్న పాత్ర పోషించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇక అనంతరం తేజా సజ్జ సరసన వచ్చిన 'మిరాయ్' చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ కొట్టారు. ఇటీవల వచ్చిన 'కొరియన్ కనకరాజు' కూడా విజయం సాధించడంతో ఆమె హ్యాట్రిక్ సక్సెస్‌లను తన ఖాతాలో వేసుకున్నారు.

## నాగార్జున చేతుల మీదుగా 'పళ్ల బురుసు' ట్రైలర్..
### కథలో ఊహించని మలుపు



అక్కినేని నాగార్జున చేతుల మీదుగా 'పళ్ల బురుసు' సినిమా ట్రైలర్ విడుదలైంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఆగస్టు 14న సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'పళ్ల బురుసు' ట్రైలర్‌ను విడుదల చేసిన నాగార్జున.. ఇది కేవలం వినోదాత్మక చిత్రం మాత్రమే కాదని, ప్రతి కుటుంబానికి దగ్గరగా ఉండే భావోద్వేగాలను చూపించే సినిమా అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఆగస్టు 14 నుంచి థియేటర్లలో తప్పకుండా చూడాలని ప్రేక్షకులను కోరారు.ట్రైలర్ ఆరంభం నుంచే ఆసక్తిని పెంచుతోంది. తన కొడుకు టూత్‌బ్రష్ కొనివ్వలేదంటూ ఓ వృద్ధుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తాడు. చిన్న విషయానికి పోలీస్ కేసా అంటూ అక్కడున్న వాళ్లంతా ఆశ్చర్యపోతారు. అయితే కథ ముందుకు సాగేకొద్దీ తండ్రి మనసులోని బాధ బయటపడుతుంది. కొడుకుతో పెరిగిన దూరం, తన మాట వినిపించాలనే తండ్రి తపనను దర్శకుడు భావోద్వేగంగా చూపించాడు.'పళ్ల బురుసు' ట్రైలర్‌లో మరో సన్నివేశం మరింత ఆసక్తి కలిగిస్తుంది. కథానాయకుడు తన సమాధిని తానే తవ్వుకుంటూ కనిపిస్తాడు. ఆ సన్నివేశం వెనుక ఉన్న కారణం ఏంటన్న ఆసక్తిని ట్రైలర్ పెంచింది. హాస్యాన్ని, భావోద్వేగాలను సమంగా మేళవిస్తూ కుటుంబ బంధాల్లో వస్తున్న మార్పులను సినిమా చూపించబోతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ 'పళ్ల బురుసు' చిత్రాన్ని నిర్మించాయి. గోమతి, ప్రజ్వల్ యాద్మ, సుజాత కీలక పాత్రలు పోషించారు. పవన్ సీహెచ్ సంగీతం అందించగా, వినోద్ కె. బంగారి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు.

## 'ధురంధర్' ప్రభంజనం..
### వరల్డ్ నెం.1 నాన్-ఇంగ్లీష్ చిత్రంగా రికార్డ్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను దక్కించుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వీక్షణలు పొందిన నాన్-ఇంగ్లీష్ చిత్రంగా ఈ సినిమా రికార్డు సృష్టించింది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ కో-సీఈవో టెడ్ సరాండోస్ వెల్లడించారు.'ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, , ఈ ఏడాది అమెరికా, యూకే చిత్రాల తర్వాత అంతర్జాతీయంగా అత్యధిక వ్యూస్ సాధించిన చిత్రంగా 'ధురంధర్' నిలిచిందని పేర్కొన్నారు. గణాంకాల ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో ఈ సినిమా ఏకంగా 37 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఏకకాలంలో 22 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ చార్టులలో ఈ చిత్రం అగ్రస్థానంలో నిలవడం విశేషం.ఆదిత్య ధర్ దర్శకత్వంలో రెండు భాగాలుగా రూపొందిన ఈ ఫ్రాంచైజీ, ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 3,100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టి సత్తా చాటింది. 2025 డిసెంబర్‌లో విడుదలైన మొదటి భాగం ఘనవిజయం సాధించగా, ఈ ఏడాది మార్చిలో వచ్చిన సీక్వెల్ 'ధురంధర్: ది రివెంజ్' భారత్‌లో రూ. 1,000 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది.భారతీయ కంటెంట్‌కు అంతర్జాతీయంగా ఆదరణ విపరీతంగా పెరుగుతోందని టెడ్ సరాండోస్ కొనియాడారు. 2024 నుంచి ప్రతీ వారం ఏదో ఒక భారతీయ సినిమా లేదా సిరీస్ నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ టాప్-10 జాబితాలో స్థానం సంపాదించుకుంటోందని ఆయన గుర్తుచేశారు. 'స్క్విడ్ గేమ్' లేదా 'మనీ హీస్ట్' వంటి భారీ గ్లోబల్ హిట్స్ భారత్ నుంచి ఎప్పుడు వస్తాయని చాలామంది అడుగుతుంటారని, అయితే భారతీయ చిత్రాలు ఇప్పటికే ఆ స్థాయి ఘనతను తరుచూ సాధిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

